ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శుక్రవారం 13 జూన్ 2025

విమాన ప్రమాదంపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

గోదావరిఖని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాద ఘటనపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లండన్ వెళుతున్న విమానం జనావాసాలు, మెడికల్ కళాశాలలపై పడడంతో మెడికోలు కూడా మృతి చెందడం దురదృష్టకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

యోగా పోస్టర్ ఆవిష్కరణ



యోగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల పోస్టర్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేగవంతమైన నేటి పరిస్థితుల్లో సమాజంలోని ప్రతీ ఒక్కరు యోగాను జీవితంలో భాగంగా మలుచుకోవాలన్నారు. యోగా ద్వారా శారీరక వ్యాయామంతోపాటు మానసిక ఒత్తిడి నుంచి దూరం కావచ్చని పేర్కొన్నారు. పెద్దపల్లిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా జరపాలని అధికారులను కోరారు. నోడల్ అధికారి డాక్టర్ అరుణ, డిప్యూటీ నోడల్ అధికారి డాక్టర్ మారుతి, డాక్టర్ కేశవరెడ్డి, ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన





- నాలుగు పోలీస్‌స్టేషన్ల ప్రారంభం
- రూ.4.25 కోట్లతో సమీకృత కూరగాయల మార్కెట్
- 484 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూముల ఇళ్లు పంపిణీ
- మంత్రులు దుద్దిళ్ల, పొంగులేటి రాక

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన నాలుగు పోలీస్‌స్టేషన్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. 24 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2001 జూన్ 1వ తేదీన 57వ మండలంగా ఎలిగేడు ఏర్పాటైంది. ఆ సమయంలో పలు ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి పోస్టులను మంజూరు చేసిన ప్పటికీ, పోలీస్‌స్టేషన్ మంజూరు చేయలేదు. జూలపల్లి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఇన్నాళ్లు కొనసాగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా పెద్దపల్లి జిల్లా 14 మండలాలతో ఏర్పాటైంది.

రామగుండం మండలాన్ని రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాలుగా, కమాన్‌పూర్ మండలాన్ని కమాన్‌పూర్, రామగిరి మండలాలుగా ఏర్పాటు చేశారు. అంతర్గాం, రామగిరి మండలాల్లో అన్ని శాఖల కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్లను కూడా మంజూరు చేశారు. బసంత్‌నగర్‌లో పోలీస్ స్టేషన్ ఉండడంతో అది పాలకుర్తి మండల పరిధిలోనికి వచ్చింది. ఎలిగేడు మండలానికి గత ప్రభుత్వం పోలీస్‌స్టేషన్ మంజూరు చేయలేదు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పెరగడంతో అనధికారికంగా ట్రాఫిక్ స్టేషన్ కొనసాగుతున్నప్పటికీ, కొత్తగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌తోపాటు మహిళా పోలీస్‌స్టేషన్, పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్న వించారు. దీంతో గతేడాది డిసెంబర్ 4వ తేదీన పెద్దపల్లిలో జరిగిన సీఎం సభకు ముందు రోజే ఒకేసారి నాలుగు పోలీస్‌స్టేషన్లతో పాటు ఇతర అభి వృద్ధి పనులకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతానికి సొంత భవనాలు లేకపోగా తాత్కాలిక భవనాల్లో స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఎలిగేడు స్టేషన్ ఒక హాస్టల్ భవనంలో, ట్రాఫిక్ స్టేషన్ కలెక్టరేట్‌లోని డీసీపీ కార్యాలయం ఆవరణలో గల స్టేషన్‌లో, పెద్దపల్లి రూరల్ స్టేషన్ కలెక్టరేట్‌కు ఎదురుగా గల ఒక అద్దె భవనంలో, మహిళా పోలీస్ స్టేషన్ పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో డివిజన్ వ్యవసాయ కార్యాలయ భవనాన్ని ఆధునీకరించి ఏర్పాటు చేస్తున్నారు.

పెద్దపల్లి పట్టణంలోని సాగర్ రోడ్డు, జెండా చౌరస్తాలో గల పాత కూరగాయల మార్కెట్ ఆవరణలో 4 కోట్ల 25 లక్షల రూపాయలతో నిర్మించనున్న సమీకృత కూరగాయల మార్కెట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. గతంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టినప్పటికీ, అది అర్ధంతరంగా నిలిచి పోయింది. అక్కడ మార్కెట్ నిర్మాణాన్ని వ్యాపారులు, కూరగాయల రైతులు వ్యతిరేకించారు. పట్టణంలో జనాభా మరింత పెరిగే అవకాశాలున్నందున భవిష్యత్‌లో దానిని పూర్తి చేసి రెండవ కూరగాయల మార్కెట్‌గా సద్వినియోగం చేసుకునే అవకాశాలు లేకపోలేదు.

ఆరేళ్ల కల నెరవేరనున్న వేళ..

పెద్దపల్లి పట్టణంలోని చందపల్లిలో 196, రాంపెల్లిలో 288 డబుల్ బెడ్ రూముల ఇళ్లు పూర్తి కావడంతో ఆరేళ్లుగా వాటిపై లబ్ధిదారులు పెట్టుకున్న కల నెరవేరనున్నది. ఆరేళ్ల క్రితం ఈ డబుల్ బెడ్ రూముల ఇళ్లు ఆరంభం అయ్యాయి. భవనాలు పూర్తయినప్పటికీ, మౌలిక వసతులు కల్పించక రెండేళ్లుగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. వీటిలో రోడ్లు, మురికి

మిగతా 8వ పేజీలో...



చందపల్లి డబుల్ బెడ్ రూముల సముదాయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

వ్యవసాయ అనుబంధ ఆదాయంపై రైతులు ఆసక్తి చూపాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

సుల్తానాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంపైనే ఆధారపడకుండా ఇతర అనుబంధ ఆదాయాలపై ఆసక్తి చూపాలని జాతీయ మాంస పరిశోధన సంస్థ సంచాలకులు ఎస్‌బి బార్ బుద్దే అన్నారు. కాట్నపల్లి రైతువేదికలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. బుద్దే మాట్లాడుతు రైతులు వ్యవసాయం పైనే ఆధారపడకుండా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపట్టాలని ఇందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త బాబీ మాట్లాడుతు రైతులు మాంసాన్ని, గుడ్లను ఇచ్చే జంతువులను పెంచుకోవాలని, తద్వారా ఆర్థిక చేయూత పొందాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి మాట్లాడుతు వరి పండించే రైతులు విత్తనం ఎంపిక చేసుకోవడమే కీలకమన్నారు. స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలని సూచిస్తూ పత్తి పంట యాజమాన్య పద్ధతులు, ఆయిల్‌పామ్ సాగు గురించి వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శంకర్ మాట్లాడుతు పాడి పరిశ్రమ అభివృద్ధి, పెరటి కోళ్ల పెంపకంపై కేంద్రం అందించే సబ్సిడీలు ప్రోత్సాహకాలను తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ కన్నకి, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, కేవీకే హెడ్ డాక్టర్ శ్రీనివాస్, ఉద్యానవన శాస్త్రవేత్త బాస్కర్ రావు మాట్లాడారు. శాస్త్రవేత్తలు వినోద్ కుమార్, నవ్య, ఏడీఏ శ్రీనాథ్, ఇఫ్కో జిల్లా అధికారి బాలాజీ, ఏఈఓలు పద్మ, ప్రశాంత్,స్వప్న తదితరులు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు



విద్యార్థులతో డీఈవో మాధవి

ధర్మారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, వారు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. గురువారం పత్తిపాక ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో మొదటి రోజే 10 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడంపై డీఈవో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొని తల్లిదండ్రులు వారి పిల్లలతో స్నేహభావంతో ఉండాలని సూచించారు. మండల విద్యాధికారి పి.ప్రభాకర్ మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం ఐందేరావు పరీక్షిత్ నరేందర్‌రావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నూతి మల్లన్న కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ప్రేంసాగర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16వ తేదీలోగా పుస్తకాలను అందించాలి

పెద్దపల్లి కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారంలోగా పూర్తిస్థాయిలో విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి తెలిపారు. మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1,72,348 పాఠ్య పుస్తకాలు ఇప్పటికే పాఠశాలలకు చేరుకోగా అందులో ఇప్పటివరకు 50,668 పంపిణీ చేశామని, 2,11,491 నోట్‌బుక్స్ పాఠశాలలకు రాగా అందులో 64,458 విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. 30,687విద్యార్థులకు ఏకరూప దుస్తులకు గాను 17,866జతల యూనిఫామ్స్ పాఠశాలలకు చేరగా 10,281 జతల దుస్తులను విద్యార్థులకు అందించినట్లు వివరించారు. పాఠశాలలు ప్రారంభమైన దృష్ట్యా త్వరితగతిన పంపిణీ కార్యక్రమం పూర్తిచేయాలన్నారు. గురువారం నాటికి 1,924 ప్రవేశాలు జిల్లా వ్యాప్తంగా 1,6వ తరగతుల్లో నమోదు అయినట్టు తెలిపారు.

క్వార్టర్ల నిర్మాణమెప్పుడు?

- దూర ప్రాంతాల నుంచి వస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు
- మూడు దశాబ్దాలుగా నెరవేరని కల



మంథని బస్టాండ్

మంథని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మంథని డిపోలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు క్వార్టర్ల నిర్మాణం కలగానే మిగిలింది. అందుబాటులో క్వార్టర్లు లేని కారణంగా వారికి తిప్పలు తప్పడం లేదు. రెండున్నర దశాబ్దాలుగా క్వార్టర్ల నిర్మాణానికి నోచుకోలేక పోయారు. ఏళ్ళ తరబడి కోట్లాది రూపాయల విలువ చేసే స్థలం వృథాగా ఉంది. దీంతో ఉద్యోగులు ఇతర ప్రాంతాల నుంచి వస్తుండడంతో అధిక శ్రమ, సమయపాలనకు విఘాతం కలుగుతుండటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. 55 బస్సు సర్వీసులు ఉన్న మంథని ఆర్టీసి డిపోలో 60 మంది డ్రైవర్లు, 80 మంది కండక్టర్లు ఉన్నారు. వీరిలో దాదాపు 23 మంది మహిళా కండక్టర్లు, 35 మంది మెకానిక్‌లు పని చేస్తున్నారు. వీరు కాకుండా అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ స్టాఫ్ దాదాపు 30 మంది వరకు ఉన్నారు. మంథని డిపో ఏర్పాటై 30 ఏళ్ళు గడుస్తున్నా సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం జరగలేదు.

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో దాదాపు 4 కోట్లకు పైగా విలువ చేసే ఎకరం స్థలం డిపోకు అనుకొని ఉంది. దీనిని క్వార్టర్ల నిర్మాణానికి కేటాయించి ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. క్వార్టర్లు కట్టించలేని పరిస్థితి ఉంటే డిపో సమీ పంలో ఉన్న స్థలాన్ని మేనేజ్‌మెంట్ తమకు మార్కెట్ రేట్ ప్రకారం విక్రయిస్తే ఇండ్లు నిర్మించుకుంటామని ఉద్యోగులు ప్రతిపాదించినా స్పందన లేదు. దీంతో సిబ్బందిలో సగం మందికి పైగా పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్, గోదావరిఖని, కాటారం, ముత్తారం, ఇతర ప్రాంతాల నుంచి వస్తూ డ్యూటీలు చేస్తున్నారు. కొందరు కిరాయికి ఇళ్ళు తీసుకొని మంథనిలో ఉంటు న్నా చాలా మంది బయట నుంచే వస్తున్నారు. దీంతో వారు సరైన సమయానికి విధులకు హాజరు కాకపో తుండటం, డ్రైవర్ వచ్చి కండక్టర్ రాక పోవడం, కండక్టర్ అందుబాటులో ఉండి డ్రైవర్ లేక పోవడం వంటి కారణాలతో బస్సు సర్వీస్‌లు నిర్ణీత సమయానికి నడవడం లేదు. ఇప్పటికైనా అందుబాటులో ఉన్న స్థలంలో ఉద్యోగులకు క్వార్టర్లు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నెలాఖరులోగా వీ-హబ్ భవనం పూర్తి చేయాలి



మహిళా శక్తి భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేందుకు వీ-హబ్ భవనాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం రంగంపల్లిలోని వీ-హబ్, రాఘవ పూర్‌లోని మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వీ-హబ్ ఏర్పాటు చేస్తోందన్నారు. గ్రామీణ మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నవంబర్ నాటికి మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం ప్రారంభించుకోవాలని, ఆ దిశగా పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, పంచాయతీ కార్యదర్శి తూముల రవి, బిల్ కలెక్టర్ బుచ్చయ్య అధికారులు, పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయం తనిఖీ

పెద్దపల్లి కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయాన్ని గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీ సమయంలో గ్రంథాలయంలో ఉన్న పాఠకులతో గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు అవసరమైన పుస్తకాలు లేకుంటే తెలుపాలని, వాటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరీక్షలలో మంచి ఫలితాలు వచ్చేలా చదువుకోవాలని సూచించారు.



ఎక్కడి పనులు అక్కడే 6

- పనులు ప్రారంభించి ఏడాది..
- పిల్లర్లకే పరిమితమైన వాటర్ ట్యాంక్

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తుమ్మల నాగేశ్వర్‌రావు 7

ఎన్నాళ్ళకెన్నాళ్ళకు...

- నేడే పోలీస్ స్టేషన్ ప్రారంభం
- 24 ఏళ్ళ తర్వాత నెరవేరనున్న కల



ప్రారంభానికి ముస్తాబైన పోలీస్ ఠాణా

ఎలిగేడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల ప్రజలు పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు 24ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు గ్రామీణ ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కోసం మండల వ్యవస్థను ఏర్పాటుచేశారు. ప్రభుత్వ కార్యాలయాలను మండల ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 56మండలాల్లో ఎలిగేడును మండలంగా ప్రకటిస్తూ గెజిట్‌లో పొందుపర్చారు. రాజకీయ ఒత్తిళ్ళతో జూలపల్లిని మండలంగా ప్రకటించారు.

మండలం కోసం ఉద్యమం

ఎలిగేడును మండలంగా ఏర్పాటు చేయకపోవడంతో 10 గ్రామాల ప్రజలు ఉద్యమాల బాటపట్టారు. దీక్షలు, రాస్తారోకోలు, ధర్నాలు ప్రధాన రహదారులపై 15ఏళ్లకు పైగా కొనసాగించారు. మండలం ఏర్పాటు చేయాలంటూ నాయకులపై ఒత్తిడి తెచ్చారు. 1990-2000వ సంవత్సరాలలో జన్మభూమిలో భాగంగా వడుకపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో జరిగిన బహిరంగ సభలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఎలిగేడును మండలంగా ఏర్పాటు చేయాలని యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. దీంతో స్పందించిన చంద్రబాబునాయుడు ఎలిగేడు మండలం ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 2001 జూన్ 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎలిగేడు 57వ మండలంగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటైనా పోలీస్‌స్టేషన్‌ను జూలపల్లి లోనే కొనసాగింది. అదే ఏడాదిలో వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికలను ఉమ్మడి మండలాల రిజర్వేషన్ ప్రకారమే నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. ప్రజలు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను బహిష్కరించారు.

పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో మండల ప్రజలు గతంలో ఎమ్మెల్యే, ఎంపీలకు మొరపెట్టుకున్న ఫలితం కనిపించ లేదు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఎలిగేడు ప్రజలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే విజయరమణారావు పోలీస్‌స్టేషన్‌ను మంజూరు చేయించారు. డిసెంబర్ 4న పెద్దపల్లి బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 24ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యను త్వరితగతిన పూర్తిచేసిన ఎమ్మెల్యేపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మర ఏర్పాట్లు

పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రకటన వెలువడినప్పటి నుంచి సీపీ ఆదేశాల మేరకు డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలిగేడులోని తహసీల్దార్ పాత భవనం నిర్వహణ కోసం తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ పర్యవేక్షిస్తూ భవనాన్ని ముస్తాబు చేసి, అన్ని సౌకర్యాలు కల్పించారు. శుక్రవారం ప్రారంభించేందుకు ఏర్పాటుచేశారు.

బంధువుకు భోజనం తీసుకెళ్తూ.. అనంతలోకాలకు

- ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం
- దంపతుల మృతి..



పుష్పలీల(ఫైల్)



రామస్వామి(ఫైల్)

శంకరపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో ఉన్న బంధువుకు భోజనం తీసుకెళ్లడానికి వెళ్తున్న భార్యాభర్తల ద్విచక్రవాహనాన్ని శంకరపట్నం మండలం కాచాపూర్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తవరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంతుపల్లికి చెందిన తాటికొండ రామస్వామి(68), భార్య తాటికొండ పుష్పలీల(65)తోకలిసి ద్విచక్రవాహనంపై హుజూరాబాద్ ఆస్పత్రిలో ఉన్న బంధువుకు భోజనం ఇచ్చి పరామర్శించేందుకు వెళ్తున్నారు. ఈక్రమంలో కాచాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి మొలంగూర్-వీణవంక రోడ్‌లో ఆముదాలపల్లివైపు రోడ్డు మూలమలుపు తిరుగుతుండగా వారి ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో పుష్పలీల అక్కడికక్కడే మృతి చెందింది. రామస్వామికి తీవ్రగాయాలు కాగా హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి ఆయనను మెరుగైనవైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం ఎస్సై కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదసంఘటనపై విచారణ చేపట్టారు. పుష్పలీల మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..

ప్రమాదాలు జరుగుతున్న ఈ స్థలంలో అధికారులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కాచాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో ఇదేస్థలంలో కాచాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి సుధాకర్‌రెడ్డి తనభార్యతోకలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగావచ్చిన వాహనం ఢీకొట్టడంతో సుధాకర్‌రెడ్డి మృతిచెందిన విషయాన్ని గుర్తు చేశారు.

వరకట్న వేధింపులు భరించలేక వివాహిత బలవన్మరణం



స్వప్న(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్‌లో అత్తవారింటి వేధింపులు భరించలేక గురువారం ఇంట్లో ఉరివేసుకొని ఓ వివాహిత ఆత్మహత్యచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, ఎల్ఎండీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన గూళ్ల వెంకటేష్‌కు, పిట్టల స్వప్న(30)తో 10సంవత్సరాలక్రితం వివాహం జరిగింది. వివాహం సందర్భంగా 10తులాల బంగారం, 5లక్షల నగదు వరకట్నంగా ఇచ్చారు. పెళ్లి జరిగిన మొదటి సంవత్సరం నుంచి స్వప్నకు తనభర్త వెంకటేష్ కుటుంబసభ్యులనుంచి అదనపువరకట్న వేధింపులు ప్రారంభమయ్యాయి.స్వప్నను భర్తవెంకటేష్ గతంలో చాలాసార్లు వేధింపులకు గురిచేస్తూ ఇంట్లో నుంచి బయటకు పంపించాడు. దీంతో పలుదఫాలు పెద్దమనుషుల సమక్షంలో భర్త వెంకటేష్‌ను మందలించారు. అయినప్పటికీ వేధింపులు తగ్గలేదు. దీంతో భరించలేక స్వప్న తనతల్లిగారింటికి వెళ్లిపోయింది. తరువాత కొన్నినెలల తరువాత వేంకటేష్ తనభార్య స్వప్నను ఇంటికి తీసుకువచ్చాడు. తిరిగి బుధవారం ఈనెల11వతేదిఇంట్లో వెంకటేష్‌తోపాటు అతని కుటుంబసభ్యులు స్వప్నతో గొడవలుజరిగాయి. దీంతో మనస్తాపం చెందిన స్వప్న ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తనకూతురు మృతికి భర్త వేంకటేష్‌తోపాటు అతని కుటుంబసభ్యులే కారణం అని స్వప్న తల్లిదండ్రులు ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

మద్యం పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం ఆరెపల్లి గ్రామంలో 45 వేల విలువైన మద్యంను బెల్ట్‌షాపు నిర్వాహకుడి వద్ద పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆరెపల్లికి చెందిన గుర్రం శ్రీనివాస్ కొంతకాలంగా అతని ఇంటిలో అక్రమంగా మద్యం నిల్వచేసి మద్యం సిట్టింగ్‌లతో ఇబ్బంది కలిగిస్తున్నాడని గ్రామస్థులు డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. దీంతో వెంటనే వెళ్లి శ్రీనివాస్ ఇంటిలో వెదకగా ఇంటి వెనుకవైపున గడ్డివాములో 101 లీటర్ల మద్యం, ఒక ఫోన్ లభ్యమైందని తెలిపారు. అక్రమంగా బెల్ట్‌షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్న గుర్రం శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ గ్రామస్థులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎక్కడి పనులు అక్కడే..

పనులు ప్రారంభించి ఏడాది..
పిల్లర్లకే పరిమితమైన వాటర్ ట్యాంక్

సుల్తానాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ఏడాది కావస్తున్నా పిల్లర్లకే పరిమితమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో భాగంగా రూ.18 కోట్లతో చేపట్టిన 14లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్ఆర్ నిర్మాణ పనులు పిల్లర్ల వరకే ఆగిపోయాయి. పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తీర్చాలనే ప్రయత్నం



పాడై పోతున్న ఐరన్ రాడ్స్

అలాగే ఉండిపోయింది. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పదిహేను వార్డులుండగా జనాభాకు తగ్గట్టుగా రక్షిత మంచినీటి వ్యవస్థ లేదు. ప్రస్తుతం రోజు విడిచి రోజు ప్రజలకు తాగునీటి సరఫరా జరుగుతోంది.

రాష్ట్రమంతటా మిషన్ భగీరథ నల్లాల ద్వారా తాగునీటి సరఫరా అవుతున్నా సుల్తానాబాద్‌లో పాత పద్ధతి ద్వారానే సరఫరా అవుతుంది. గట్టేపల్లి మానేరు వాగు నుంచి అశోక్‌నగర్ బావి (సంప్) వరకు పైపులైన్ల ద్వారా నీరు వస్తుంది. అక్కడి నుంచి పట్టణంలోని వివిధ ట్యాంకులకు సరఫరా జరుగుతుంది. మిషన్ భగీరథ పైపులైన్ నీరు కూడా నేరుగా ట్యాంకుల నుంచి బావిలో పడతాయి. ఈ విధానంలో అనేక అవాంతరాలు ఎదురువుతున్నాయి. గట్టేపల్లి వద్ద గల బావుల్లో మోటార్లు కాలిపోవడం నీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఇబ్బందులను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ నిధులు రూ 18.40 కోట్లతో 14 లక్షల లీటర్ల సామ ర్థ్యం గల ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని, పట్టణంలో కొత్త పైపులైను వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు భావించారు. శిలాఫలకాన్ని 7 ఆగస్టు 2024న ఎమ్మెల్యే విజయరమణారావు ఆవిష్కరించారు.పనులు మాత్రం ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. పట్టణంలో నిర్మాణం పూర్తయిన వాటర్ ట్యాంక్‌లు కూడా నిరుపయోగంగా ఉన్నాయి. మార్కండేయ కాలనీలోని పెరికిగిద్ద ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ట్యాంక్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్నా కేవలం పిల్లర్లకే పరిమితమయ్యాయి. పట్టణ ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు.



పునాదులకే పరిమితమైన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులు సీజ్

తిమ్మాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న నాలుగు విద్యాసంస్థల బస్సులను గురువారం రవాణాశాఖ అధికారులు పట్టుకొని సీజ్‌చేశారు. గురువారం నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు ప్రత్యేకంగా డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు, సిబ్బందితోకలిసి మూడు బృందాలుగా స్పెషన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో కరీంనగర్‌లోని రేకుర్తి, మంచిర్యాల రోడ్డు, సిరిసిల్ల రోడ్డు వద్ద తనిఖీల్లో నాలుగు విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్నట్లు తేలింది. దీంతో పట్టుకున్న నాలుగు విద్యాసంస్థల బస్సులను సీజ్ చేసి తిమ్మాపూర్ మండలకేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ డ్రైవ్‌లో ఫిట్‌నెస్‌తోపాటు ఇతర పత్రాలు లేకుండా విద్యా సంస్థల బస్సులను సీజ్ చేయడంతోపాటు విద్యాసంస్థలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు ఫిట్‌నెస్ చేయించుకోకుండా బస్సులను రోడ్లపైకి తీసుకురావద్దని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు వివిధ విద్యాసంస్థలకు చెందిన 836బస్సులకు గాను 610బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ చేయించారని, ఇంకా 226బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ శ్రవంతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాసంస్థల బస్సు పత్రాలను తనిఖీ చేస్తున్న డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష

వేములవాడ టౌన్/బోయినపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష, 400 రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషనల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్ గురువారం తీర్పు వెలువరించారు. వేములవాడ రూరల్‌సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన వేములవాడ సుమ కొడుకు సాయిచరణ్ దసరా సందర్భంగా వేంకటేశ్వర ఆలయం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన కట్ట గంగరాజు అనేవ్యక్తి మద్యం మత్తులో సిమెంట్ ఇటుకలతో చరణ్‌పైదాడి చేశాడు. దీంతో చరణ్ తల్లి బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటిఎస్ఐ శ్రీనివాస్ హత్యాహత్నం కేసునమోదు చేశారు. అప్పటి సీఐలు నవీన్‌కుమార్, బన్సీలాల్ దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా కేసు పూర్వపరాలను పరిశీలించన అసిస్టెంట్ సెషన్‌కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ జాదవ్ నిందితుడికి ఐదు సంవత్సరాల జైలుశిక్షతోపాటు 400 రూపాయల జరిమానా విధించారు. నిందితలకు శిక్షపడేలా కృషిచేసిన సంబంధిత సీఐలను, కోర్టుకానిస్టేబుల్స్‌ను ఎస్పీ అభినందించారు.

అనుమతులు లేని పెట్రోల్ బంక్ సీజ్

మానకొండూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ సంస్థ పెట్రోల్ బంక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీవో కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ముంజంపల్లి పంచాయతి కార్యదర్శి జీపీసిబ్బందితో కలిసి గురువారం సీజ్ చేశారు. టీజీబీపాస్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని గతంలోనే మూడుసార్లు బంక్ నిర్వాహకుడికి నోటీసులు ఇచ్చినా నిర్మాణాన్ని ఆపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎంపీవో తెలిపారు.

బ్లాక్‌ఫిల్మ్ అతికించిన 23 కార్లకు జరిమానా

కరీంనగర్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్‌పోలీసులు గురువారం నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్‌ను అతికించిన 23కార్లకు జరిమానా విధించారు. ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద ట్రాఫిక్‌సీఐ పర్శ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కారుఅద్దాలకు పరిమితికి మించి మసకబారే విధంగా బ్లాక్ ఫిల్మ్‌ను అతికించినట్లు టింట్ మీటర్ ద్వారా పరీక్షించి జరిమానాలు విధించారు. అనంతరం కారు యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పర్శ రమేష్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాల అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్‌లు అతికిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పకుండా పాటించాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ ఇషాక్ అహమ్మద్, ఆర్ఎస్ఐ గణేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కారు అద్దాలను టింట్ మీటర్‌తో పరీక్షిస్తున్న ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్, ఎస్ఐలు

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా



సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) అధ్వర్యంలో కార్మికులతో కలిసి నాయకులు ధర్నా చేసి బీడీ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవాలని కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బీడీకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ బీడీ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. కార్మికుల డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు వాడుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొండల్‌రెడ్డి, నాయకులు , కార్మికులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం ఆరెపల్లికి చెందినవీణవంక సంతోష్ మంగళవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. సంతోష్ తనవ్యవసాయభూమిని పక్కనవారు అక్రమంగా దున్ని చంపుతానని బెదిరించడంతో మనస్తాపంతో ఆత్మహత్యకుయత్నించి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. పొలంవద్దనే పురుగు మందుతాగిన సంతోష్ సెల్ఫీవీడియోతీసి తాను చనిపోతున్నానని తనఫోన్‌లో స్టేటస్‌గా పెట్టుకోగా కుటుంబసభ్యులు గుర్తించి అతన్ని ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. అక్రమంగా భూమిలోకి వచ్చి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుసంతోష్ ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

ఇల్లంతకుంట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పండుగు చక్రపాణి(40) అనే ఆటో డ్రైవర్ క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం చక్రపాణి ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబకలహాలతో గురువారం వ్యవసాయ బావివద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలోఉన్న చక్రపాణిని ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిమండలం ఖాజీపూర్ వాగు, కరీంనగర్‌రూరల్ మండలం ఇరుకుల్ల వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఓర్సుఅశోక్, తిరుపతిలపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మంద కృష్ణ సన్మాన సభను విజయవంతం చేయాలి

- వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు సుధాకర్

సిరిసిల్ల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న హైదరాబాద్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆత్మీయ సన్మాన సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి దేశంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా వికలాంగుల సమాజాన్ని విస్మరించాయన్నారు. ఉద్యమ నేత మంద కృష్ణమాదిగ అట్టడుగున ఉన్న వికలాంగుల సమాజాన్ని చేరదీశారన్నారు. కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డును ప్రకటించిందన్నారు. వికలాంగుల పక్షాన ఈనెల 19న హైదరాబాద్‌లో మంద కృష్ణ ఆత్మీయ సమ్మేళన సభను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వికలాంగులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆత్మీయ సమ్మేళన సభను విజయ వంతం చేయాలని కోరారు. సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జోగని తిరుపతి, ఉపాధ్యక్షుడు తలారి సురేష్, నాయకులు మెరుగు రాములు పీర్లవంచ నరసయ్య, పెరుమాండ్ల సాయికుమార్, తాటి బెల్లి దుర్గయ్య, శోభ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

రుద్రంగి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలకేంద్రంలో ఫర్టిలైజర్‌షాపుల్లో మండల వ్యవసాయశాఖ అధికారులు ప్రియదర్శిని, సంజీవ్, ఎస్ఐ మోతిరామ్ గురువారం ఆకస్మికతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాషాపుల్లో స్టాక్‌రికార్డులను పరిశీలించడంతోపాటు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే వ్యాపారులపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా నకిలీవిత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే రైతులు, ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, వ్యవసాయఅధికారి కార్యాలయంలో సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



రుద్రంగిలో ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు

మహిళ వీరంగం

సిరిసిల్ల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో గురువారం రాత్రి మద్యం మత్తులో మహిళ వీరంగం సృష్టించింది. సిరిసిల్ల కూరగాయాల మార్కెట్లో కూరగాయలు అమ్ముకుంటూ ఇద్దరు కొడుకులను పోషించుకునే మహిళ మద్యానికి బానిసైంది. భర్తకు దూరమై మద్యంసేవిస్తూ తరుచూ మార్కెట్లో గొడవపడుతుంటుంది. గురువారం రాత్రి మహిళ పెద్ద కుమారుడు ఓ ఇంట్లో దొంగతనం చేయగా ఆ ఇంటి యజమాని స్థానిక మున్సిపల్ సమీపంలో పట్టుకొని మందలించి వదిలేశాడు. ఆ బాలుడు తల్లికి జరిగిన విషయం చెప్పడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ మహిళ మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పాన్‌షాప్ వద్ద ఉన్న ఇంటి యజమానితో గొడవకు దిగింది. అంతటితో ఆగకుండా అతడిపై దాడిచేసి ఎలాంటి సంబంధంలేని పాన్‌షాప్‌లోని అద్దాలను ధ్వంసం చేసి వీరంగం సృష్టించడంతో జనం మహిళకు దేహశుద్ధి చేశారు.

పిడుగుపాటుతో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

మెట్‌పల్లి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామంలో గురువారం ఉదయం పిడుగుపాటుతో పాక్షికంగా ఇల్లు దెబ్బతింది. గ్రామంలో ఈదురు గాలులతో వర్షం కురిసింది. గ్రామంలోని జెల్ల మహేష్ ఇంటి దాబాపై పిడుగు పడడంతో స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మెట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్లు పరిశీలించారు.

పురుగుల మందు తాగి
నవ వరుడు ఆత్మహత్య

- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



శ్రీకాంత్(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన శ్రీకాంత్(30) అనే నవవరుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. రేణికుంట గ్రామానికిచెందిన పెసర శ్రీకాంత్‌కు గతనెల మే 16న పూసాల గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహం జరిగింది. పెళ్లయిన వారం వరకు రేణికుంటలోనే ఉన్న ఉషారాణి తన పుట్టిల్లు పూసాల గ్రామానికి వెళ్లింది. తరువాత శ్రీకాంత్ కూడా ఉషారాణి వాళ్ల ఇంటికి వెళ్లి రేణికుంటకు వచ్చాడు. పుసాలకు వెళ్లి వచ్చినప్పటి నుంచి శ్రీకాంత్ దిగులుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 2న ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గురువారం శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోల్‌సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బాహుజీనగర్‌లోని గురువారం ఓ ఇంట్లో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21400, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాహుజీనగర్‌లోని ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసినట్టు ఆయన తెలిపారు. పేకాట ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

లారీ డ్రైవర్‌కు ఆరు రోజుల జైలు శిక్ష

హుజూరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన లారీ డ్రైవర్‌కు హుజూరాబాద్ జడ్జీ ఆరు రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. హుజురాబాద్‌లో గురువారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా జమ్మికుంట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొడిగే భిక్షపతి అనే లారీడ్రైవర్ మద్యం తాగి లారీ నడుపుకుంటూ వస్తున్నాడు. పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేయగా మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో లారీ డ్రైవర్ భిక్షపతిని జడ్జీ ముందు హాజరు పరుచగా ఆరు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తుమ్మల నాగేశ్వర్‌రావు


తుమ్మల నాగేశ్వరరావు

కరీంనగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిమంత్రిగా రాష్ట్ర వ్యవసాయశాఖ, మార్కెటింగ్, చేనేతజౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నుంచి ఇప్పటి వరకు 16 నెలలపాటు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కరీంనగర్ ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించారు. ఆయన స్థానంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నియమించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2సార్లు మాత్రమే ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షజరిపారు. కాగా ఉత్తమ్‌కుమార్ రెడ్డితోపాటు కొందరు సీనియర్ మంత్రులను ఏ జిల్లాకుకూడా ఇన్‌చార్జిగా నియామకం చేయలేదు. ఇన్‌చార్జిమంత్రి పట్ల విముఖత చూపటమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలు కరీంనగర్ జిల్లాలో ఇంత వరకు ఏర్పాటు కాలేదు. కొత్తగా బాధ్యతలు తీసుకుంటున్న ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అయినా త్వరగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇతర జిల్లాల్లో ఇందిరమ్మ కమిటీలు పూర్తి అయి లబ్ధిదారుల ఎంపిక కూడా చాలా జిల్లాల్లో పూర్తికాగా ఇక్కడమాత్రం కమిటీల ఏర్పాటులోనే తీవ్రజాప్యం జరుగుతున్నది.

రైతులు నష్టపోకుండా విత్తన చట్టం

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

కరీంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు, పంటలు సాగుచేస్తున్న రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో విత్తనచట్టం ముసాయిదాను రూపొందిస్తుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని కేడీసీసీబీ కాన్ఫరెన్స్ హాల్‌లో నూతన విత్తనంచట్టం ముసాయిదాను రూపొందించేందుకు విత్తన కంపెనీ, ఆర్గనైజర్స్, డీలర్లు, రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల అభిప్రాయ సేకరణకు రాష్ట్రస్థాయి విత్తన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని కఠిన విత్తన చట్టాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తా నని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీసభ్యులు డి నరసింహారెడ్డి, పుష్పరాణి, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఉషారాణి, శ్రావణి, విజయభాస్కర్, మధుకర్, కేవీకే జమ్మికుంట నుంచి విజయ్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏలు, ఏవోలు, రైతులు, ఉత్పత్తిదారులు, ఆర్గనైజర్లు, డీలర్లు పాల్గొన్నారు.

రైతు నేస్తం విస్తరణకు పచ్చజెండా

అధిక దిగుబడులు సాధించేలా కార్యక్రమాలు

జగిత్యాల జిల్లాలో ఇప్పటికే 19 రైతు వేదికల్లో ఏర్పాటు

తాజాగా మరో 33 కేంద్రాలు మంజూరు

జగిత్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతు నేస్తం పేరుతో సాగులో మెళకువలు, సూచనలు అందించే ప్రయత్నాలు మరింత విస్తరించేందుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. జగిత్యాల జిల్లాలో గతంలో 19 రైతు నేస్తం కేంద్రాలు ఏర్పాటు చేశారు. మరిన్ని రైతు నేస్తం కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన రైతు వేదికల్లో దృశ్య, శ్రవణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. పంట ఉత్పత్తులను పెంచే విధంగా నిపుణులు సూచనలు ఇస్తున్నారు. అన్ని గ్రామాల రైతులు కార్యక్రమానికి హాజరై వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రతి మంగళవారం హైదరాబాద్ నుంచి పలువురు శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఆధునిక వ్యవసాయ విధానాలతో పాటు సస్య రక్షణపై సలహాలు ఇస్తున్నారు. ఈ విధానం రైతులకు ప్రయోజనకరంగా ఉండడంతో మరిన్ని రైతు నేస్తం కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనేపథ్యంలో అధికారుల ప్రతిపాదనల మేరకు తాజాగా 33కేంద్రాలు మంజూర య్యాయి. వీటిని ఏర్పాటు చేసే ప్రక్రి యలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎంపిక చేసిన రైతు వేదికల్లో సామగ్రి అమర్చాల్సి ఉంది.


రైతు నేస్తం కేంద్రంలో సమావేశంలో పాల్గొన్న రైతులు, అధికారులు

సందేహాల నివృత్తికి..

జిల్లాలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఎరువుల యాజమాన్యం, వంగ డాల ఎంపిక, కలుపు నివారణ, అధికా ర వర్షాల వేళ పంటల వారీగా తీసుకోవాల్సిన చర్యలు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్నారు. చిరు ధాన్యాలు, వాణిజ్య పంటలు, కూరగాయల సాగు విధానాలను రైతులు అడిగి తెలుసుకొని, సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. సీజన్‌కు అనుగుణంగా పశువులకు అందించాల్సిన టీకాలపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు వచ్చే రాయితీలు, దరఖాస్తు విధానాలను వ్యవసాయ అధికారులు తెలియజేస్తు న్నారు. తాజాగా మరిన్ని రైతు నేస్తం కేంద్రాలను విస్త రించడంతో మరింత మంది రైతులకు సేవలు అందు బాటులోకి వచ్చే ఆస్కారముంది.

లక్ష్యాలివే..

జిల్లా వ్యాప్తంగా 71 క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించి వాటి ద్వారా పలు రకాల సలహాలు ఇస్తున్నారు. తక్కువ పెటుబడితో అధిక దిగుబడులు సాధించి లాభాలు ఆర్జించే విధంగా రైతుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో రైతునేస్తం ఒకటిగా ఉంటోంది. దృశ్య, శ్రవణ సేవల విస్తరణకు వ్యవసాయంతో పాటు దానికి అనుబంధంగా ఉండే ఉద్యాన, మత్స్య, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, నీటి పారుదల శాఖలకు సంబంధించి సలహాలు అందిస్తు న్నారు. రైతు నేస్తం ద్వారా కర్షకులకు అధికారులు పలు రకాల ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. జిల్లాకు మంజూరైన రైతు నేస్తం యూనిట్లను రైతు వేదికల్లో ఏర్పాటు చేస్తారు. బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ సాయంతో దృశ్య, శ్రవణ విధానం కొనసాగుతుంది. వీడియో కాన్ఫరెన్స్ సౌక ర్యం కల్పిస్తారు. రైతు నేస్తం నిర్వ హణ మొత్తం ఏఈవోలకు అప్పగిం చారు. టీవీ, బ్యాట రీ తదితర విలువైన పరికరా లు కేంద్రాల్లో ఉంటాయి.

కొత్తపేట రైతు వేదిక


జిల్లాలో రైతు నేస్తం మంజూరైన కేంద్రాలివే...

మండలం	రైతు వేదికలు
జగిత్యాల రూరల్...	కల్లెడ, లక్ష్మీపూర్
సారంగపూర్...	కోనాపూర్
బీర్‌పూర్...	మంగేళా
రాయికల్...	భూపతిపూర్, దర్మాజిపేట
కోరుట్ల...	పైడిమడుగు,మోహన్ రావుపేట
మెట్‌పల్లి...	వెల్లుల్ల, మెట్‌పల్లి
మల్లాపూర్...	ముత్యంపేట, మొగిలిపేట
ఇబ్రహీంపట్నం	గోదూర్,వర్షకొండ
కథలాపూర్...	భూషణ్‌రావుపేట, బొమ్మెన
మేడిపల్లి...	పోరుమళ్ల
బీమారం...	మన్నెగూడెం, గోవిందారం
మల్యాల...	మానాల, నూకపల్లి
కొడిమ్యాల...	తిరుమలాపూర్, కొడిమ్యాల
ధర్మపురి...	జైనా, ధర్మపురి
బుగ్గారం...	బుగ్గారం
ఎండపల్లి...	గుల్లకోట, కొత్తపేట
గొల్లపల్లి....	వెనుగుమట్ల, ఇబ్రహీంనగర్
పెగడపల్లి...	ఎల్లాపూర్, నంచర్ల
వెల్గటూరు...	చెగ్యాం


సద్వినియోగం చేసుకోవాలి

భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జగిత్యాల



రైతు నేస్తం వేదికల్లో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖతో పాటు ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో కార్యక్రమానికి హాజరయ్యే రైతుల అన్ని రకాల సందేహాలు నివృత్తి అవుతున్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన 33 గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేయిస్తున్నాం.

జూలైలో తిరుపతికి ప్రత్యేక రైళ్లు



కరీంనగర్ రూరల్, జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా జూలై మాసంలో కరీంనగర్‌నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు నడిపించేందుకు దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. 6 నుంచి 27వ తేదీ వరకు రైలు నెం. 02761 తిరుపతి నుంచి కరీంనగర్‌కు నాలుగు ట్రిప్పులు, 7జూలై నుంచి 28 వరకు రైలు నెం. 02762 కరీంనగర్ నుంచి తిరుపతికి నాలుగు ట్రిప్పులు నడిపించనున్నారు. ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని నెలరోజుల పాటు ప్రత్యేకరైళ్లు నడుస్తాయని కరీంనగర్ స్టేషన్‌మేనేజర్ రవీందర్ తెలిపారు. రెగ్యులర్‌గా కరీంనగర్ నుంచి ప్రతి గురు, ఆదివారాల్లో తిరుపతికి వెళ్లే రైళ్లతోపాటు ఈ ప్రత్యేకరైళ్లను అదనంగా నడిపిస్తున్నట్లు తెలిపారు. జూలైలో 6, 13, 20, 27 తేదీల్లో తిరుపతి నుంచి కరీంనగర్‌కు, 7, 14, 21, 28 తేదీల్లో కరీంనగర్ నుంచి తిరుపతికి రైళ్లు నడుస్తాయని తెలిపారు.

● ప్రత్యేక రైళ్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ నుంచి తిరుపతి , తిరుపతి నుంచి కరీంనగర్‌కు వెళ్ళే రైలును ప్రతి రోజు నడిపించాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తాను పలుమార్లు విజ్ఞప్తి చేశానని, స్పందించిన ఆయన ప్రత్యేక రైళ్ల మంజూరు చేశారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు వేసిన రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కొండగట్టుకు నిరంతర విద్యుత్

మల్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో నిరంతర విద్యుత్‌సరఫరా కోసం సబ్‌స్టేషన్‌లో గురువారం ట్రాన్స్‌కోఅధికారులు 5మెగావోల్ట్ ఆంప్స్ సామర్థ్యంగల ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దీనివలన ఆంజనేయస్వామి దేవస్థానంతో పాటు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుందని ఎస్ఈ శాల్యనాయక్ తెలిపారు. కార్యక్రమంలో డీఈలు రాజిరెడ్డి, రవీందర్ ఏడీఈలు మహేందర్, రాజు, అనిల్‌కుమార్,ఏఈలు పాల్గొన్నారు.

మానువాడ సొసైటీపై ఫిర్యాదు

బోయినపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలంలోని మానువాడ సహకార సంఘం సొసైటీపై వైస్ చైర్మన్ బొల్లం జీవన్‌రెడ్డి జిల్లా డీసీవోకు గురువారం ఫిర్యాదు చేశాడు. సొసైటీ ద్వారా అందించిన రుణాలు, లావాదేవీల అవకతవకలపై శాఖాపరమైన విచారణ జరపాలన్నారు. సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి సంఘం సమావేశాలను సైతం నిర్వహించడం లేదన్నారు. ఫిర్యాదు అంశాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నాడు.

కన్నుల పండువగా పోచమ్మ బోనాలు


సిరిసిల్ల చిన్నబోనాలలో పోచమ్మ బోనాలు


బోనాల ఉరేగింపులో నృత్యాలు

సిరిసిల్ల రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామంలో గురువారం పోచమ్మ బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నబోనాల గ్రామంలోని అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని కులాలకు చెందిన ప్రతీ కుటుంబం నుంచి మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని ఒగ్గుడోలు, డప్పుచప్పుళ్లతో ఊరేంగిపుగా దేవాలయాన్ని చేరుకున్నారు. అనంతరం బోనాలతో నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్, మాజీఎంపీపీ దడిగెల కమలాబాయ్, మాజీ వైస్‌ఎంపీపీ చల్లాహరికృష్ణ, గ్రామస్తులున్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో గురువారం పలు సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరాజరాజేశ్వర మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో డప్పుచప్పుల మధ్య పోచమ్మ ఆలయంవరకు మహిళలు బోనాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకు న్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్ పల్లెగ్రామంలో యాదవసంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. యాదవులు ప్రతి ఇంటికి బోనంతీసి ఆటపాటతో ఉరేగింపుగా వెళ్లి పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు మీరాల శ్రీనివాస్ యాదవ్, అంబటి కిషన్, జంగం శ్రీనివాస్ కొండవేని కిషన్, కుక్కల రాములు, గొట్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. 86.85 లక్షలు


రాజన్న హుండీ డబ్బులను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు

వేములవాడ కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయం 86,85,300 రూపాయలు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య హుండీలను ఆలయ ఉద్యోగులు, సిబ్బంది గురువారం విప్పి లెక్కించారు. రాజన్న ఆలయ 15రోజుల హుండీల ఆదాయం 8685,300 రూపాయలు రాగా, 83గ్రాముల బంగారం, ఐదు కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు తెలిపారు, హుండీ లెక్కింపులో ఈవో వినోద్‌రెడ్డి, ఏసీ కార్యాలయ పరిశీలకుడు సత్యనారాయణ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు


టీజీఎస్‌ఆర్‌టీసీ మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

భగత్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్క రించాలని టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు అన్నారు. గురువారం టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్-సీఐటీయూ జిల్లా నాల్గవమహాసభలు నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జెండాను ఆవిష్కరించి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో కార్మికులపై పనిఒత్తిడి పెరిగిపోయిందన్నారు. కండక్టర్లను డ్రైవర్లను పనిఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ నూతన అధ్యక్షునిగా రాపల్లిరాజయ్య, కార్యదర్శిగా వీరగోని శ్రీనివాస్, ప్రచార కార్య దర్శిగా కడారి అంజిరెడ్డి, జాయింట్‌సెక్రెటరీగా ములుగూరి రాజయ్య, కోశాధికారి ఎం నాగరాజు, గౌరవాధ్యక్షులుగా ఎడ్లరమేష్‌ను ఎన్నుకున్నారు.

మిడ్ మానేరు డ్యాంను పరిశీలించిన కేంద్ర అధికారులు


మిడ్ మానేరు డ్యాంను పరిశీలిస్తున్న అధికారులు

బోయినపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మానువాడ మిడ్‌మానేరు ప్రాజెక్టును సెంట్రల్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ జాయింట్ సెక్రెటరీ సెంతల్ రాజన్ చొక్కాలింగం ఆధ్వర్యంలో అధికారులు గురువారం పరిశీలించారు. ప్రాజెక్ట్‌వివరాలు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభంనుంచి ఇప్పటివరకు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. నీటిని ఏఏ ప్రాంతాలకు తరలిస్తున్నారో రిపోర్ట్ తీసుకున్నారు. పూర్తి వివరాలను పరిశీలించి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్ట్ సుధీర్ కుమార్, కృష్ణ, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ ఈఈ ధీరజ్ సింఘాల్, ప్రాజెక్ట్ ఈఈ జగన్, డీఈలు రాజు, శ్రీనివాస్, ఏఈలు రాధిక, అనుపమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగకు మూడు సంవత్సరాల జైలు

ఇబ్రహీంపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్తెక్కపల్లి గ్రామంలో 2021లో జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించిన కేసులో నిందితుడికి మూడుసంవత్సరాల జైలుశిక్షను జిల్లా సెషన్స్ కోర్టు నాయమూర్తి నారాయణ గురువారం విధించినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. మండలంలోని సత్తెక్కపల్లి గ్రామంలో 2021 సంవత్సరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌తీగ, ఆయిల్ దొంగిలించినకేసులో విద్యుత్‌శాఖ ఏఈ సంక త్రిమూర్తులు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటిపోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని ఒంగోలు జిల్లా సింగరాయకొండకు చెందిన పల్లిపాటి ఏసుదాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులోసాక్షులను విచారించిన న్యాయమూర్తి నారాయణ నిందితుడు ఏసుదాసుకు మూడు సంవత్సరాల జైలుశిక్ష రూ.3000జరిమాన విధించినట్లుఎస్ఐ తెలిపారు.

యాదవులపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న సీఎం

● యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్

సిరిసిల్ల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదవులపై నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని యాదవ హక్కుల పోరాటసమితి రాష్ట్రఅధ్యక్షుడు కొక్కుల దేవేందర్‌యాదవ్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రతి క్యాబినెట్‌లో యాదవ సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రి పదవి ఇచ్చారని అన్నారు. తెలంగాణ వచ్చాక కూడా రెండుపర్యాయాలు యాదవ్‌లకు మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం యాదవులను నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కావాలనే యాదవులను అణచివేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు కావస్తున్నా యాదవులకు మంత్రి పదవి ఇవ్వలేదని, కార్పొరేషన్ ప్రకటించి ఇప్పటి వరకు చైర్మన్, డైరెక్టర్ల పేర్లు ప్రకటించకపోవడం విచారకరమన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూడా యాదవులకు ఎక్కడకూడా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాష ప్రకారం యాదవులకు 16నుంచి 18శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మిగిలిఉన్న మంత్రివర్గ విస్తరణలో యాదవసామాజిక వర్గానికి చెందిన వారికి ఎమ్మెల్సీపదవి ఇచ్చి మంత్రిగా అవకాశం కల్పించకపోతే గాంధీభవన్‌కు వచ్చి సత్యాగ్రహ దీక్షలను చేపడతామని అన్నారు. సమావేశంలో యాదవ హక్కులపోరాటసమితి రాష్ట్ర కార్యదర్శి వీరబోయిన మల్లేశంయాదవ్, నాయకులు మెండే శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌యాదవ్, స్వామి యాదవ్, కృష్ణకాంత్‌యాదవ్, చంద్రశేఖర్‌యాదవ్, మారవేణి రాజుయాదవ్, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నిలిచిన వర్షం నీరు

● ఇబ్బందులు పడిన విద్యార్థులు

మల్లాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలో గురువారం కురిసిన వర్షానికి పునరావాసగ్రామం అయిన రత్నాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వరదనీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రత్నాపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిలిచిన వరద నీరు

శాతవాహనలో నూతన ఎంఫార్మసీ కోర్సు

గణేశ్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని మానేరుడ్యాం పక్కనఉన్న ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో నూతన ఎంఫార్మసీ కోర్సులు 2025-26 విద్యాసంవత్సరంలో ప్రారంభించడానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు ఉమేష్ కుమార్ తెలిపారు. ఎంతోకాలంగా నూతనకోర్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు ఫార్మసీ కళాశాలలో ఫార్మకాలజీ, ఫార్మాసిటిక్స్, ఫార్మసిటికల్ అనాలసిస్ విభాగాలలో 15సీట్లు చొప్పున మొత్తం 45సీట్లకు అడ్మిషన్స్‌కి అనుమతి లభించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీశైలం, రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్ ఉపకులపతి ఉమేష్ కుమార్‌ని కలిసి అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో కోతుల బెడద


దుర్శేడ్‌లో ఓ ఇంట్లో నుంచి బయటకు వస్తున్న కోతులు

కరీంనగర్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో కోతుల బెడదతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. గ్రామాల్లో గుంపులుగా వచ్చి పెంకుటిల్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లల్లో చొరబడి వస్తువులను ఎత్తుకెళ్లిపోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులపైకి కోతులు దాడికి ప్రయత్నిస్తున్నాయి. గురువారం దుర్శేడ్ గ్రామంలో వానరం గుంపుగా వచ్చి పెంకుటిళ్లపై ఉన్న గూనలను చిందర వందర చేశాయి. మొగ్దుంపూర్, దుర్శేడ్, ఎలబోతారం, నగునూర్, వల్లంపహాడ్ గ్రామాల్లో కొందరిపై కోతులు దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ధర్మారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) మండలంలో పలు అభివృద్ధి పనులను వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ ఛైర్మన్ అరిగె లింగయ్యతో కలిసి ప్రారంభించారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశాలతో లంబాడి తండా (బి) గ్రామంలో రెండు బోర్‌వెల్స్ వేయించారు. అనంతరం 30 లక్షల డీఎంఎఫ్‌టి నిధుల ద్వారా రెండు సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు.

ఖనిలో భారీ వర్షం.. జలమయమైన రోడ్లు

కళ్యాణ్‌నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పలు కాలనీల్లో రోడ్లు జలమయమయ్యాయి. ప్రధాన మురికి కాలువలు పొంగి ప్రవహించాయి. పిడుగులు పడడంతో జనం భయాందోళనకు గురయ్యారు. గురువారం సాయంత్రం కూడా వర్షం కురిసింది. ఒక సెంటీమీటర్ వర్షపాతం నమోదు అయినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

భూ భారతిలో సమస్యలు పరిష్కారం

ఓదెల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం మార్గం చూపుతుందని తహసీల్దార్ ధీరజ్‌కుమార్ తెలిపారు. గురువారం ఇందుర్తిలో భూ భారతి సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే నేరుగా దరఖాస్తు చేసుకుంటే పరిష్కారం ఉంటుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌రావు ఆధ్వర్యంలో భూ సమస్యల పరిష్కారం కోసం రైతుల నుండి 39 దరఖాస్తులను స్వీకరించారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

కోల్‌సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ 25వ డివిజన్‌లో కుక్కల బెడదతో సతమతమవుతున్నామని గురువారం మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలతరాజు కమిషనర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. పాదచారులు, పిల్లలపై దాడి చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని రోజులుగా మంచినీరు సరిగా రావడం లేదని, సమస్యను తీర్చాలని కోరారు. గతంలో తెల్లకార్డు ఉన్న వారికి ఉచితంగా అంత్యక్రియలు నిర్వహించే వారని, ఇప్పుడు రద్దు చేశారని, ఉచితంగా అంత్యక్రియలు నిర్వహించే కార్యక్రమం చేపట్టాలని కోరారు.

రేపు ఓబీసీ పోరుబాట పుస్తకావిష్కరణ

పెద్దపల్లిటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయ వాది పృథ్వీరాజ్ సింగ్ రచించిన ఓబీసీల పోరుబాట పుస్తక ఆవిష్కరణ ఈనెల 14 న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మల్క రామస్వామి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎల్.రాజయ్య తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుస్తకావిష్కరణకు ఓబీసీలు పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. పరికిపండ్ల రాము, అనిల్, రవితేజ, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): బీసీల ప్రాధాన్యత లేకుంటే సమాజాభివృద్ధి అసాధ్యమని బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడం లేదని, ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. దీనిపై ఐఏఎస్ నరహరి 'ఓబీసీల చరిత్ర, హక్కులు, భవిష్యత్ దిశ' అనే పుస్తకాన్ని రచించారని, పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథిగా ఎంపీ ఈటెల రాజేందర్ హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సబ్బు మల్లయ్య, ఐత శివ కుమార్, కోడూరి రమేష్, అపర్ణ, రాజన్న, పాల్గొన్నారు.

పదాధికారులకు శిక్షణ

పాలకుర్తి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జనని మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘం పదాధికారులకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఐబి డైరెక్టర్ నవీన్ గ్రామ సంఘం పదాధికారుల విధులు, బాధ్యతలు, గ్రామ సంఘం నిర్వాహణ, అందించే సేవలు సభ్యులకు వివరించారు. పిఎంలు ర వీందర్ రావు, భారతి, డిపిఎం ఐబి రవి, చైతన్యజ్యోతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు స్నేహ, ఏపిఎం సదానందం పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి...

రామగిరి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రత్నాపూర్ రైతువేదికలో గురువారం కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు మేట్లకు జిల్లా రిసోర్స్‌పర్సన్లతో శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన రెండవ ఫేజ్ పై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు. ఎంపీడీవో శైలజారాణి, హౌసింగ్ డీఈఈ దస్తగిరి, ఎంపీవో ఉమేశ్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్‌ను ప్రారంభించాలి

పెద్దపల్లి కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బాలికల కళాశాల హాస్టల్ మంజూరై మూడేళ్ళు గడుస్తున్నా ప్రారంభించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అభిరామ్, సాయి జనార్దన్, శివ, నాగచైతన్య, దిలీప్, పాల్గొన్నారు.

పీఎం సురక్షణ బీమా యోజన బాండ్ల పంపిణీ

కోల్‌సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ రోడ్డులో వీధి వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారులకు గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన బాండ్లను డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అందజేశారు. ఈఈ రామన్, డీఈలు షాబాజ్, జమీల్, ఏఈ తేజస్విని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పాలకుర్తి,జూన్ 12(ఆంధ్రజ్యోతి):టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీబి అలర్ట్ ఇండియా ప్రోగ్రాం జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం టీబి సర్వేవర్స్‌తో మాట్లాడారు. క్షయ నివారణకు మందులు లభిస్తున్నాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే తేమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బసంత్‌నగర్ ప్రధాన వైద్యురాలు లక్ష్మీ భవాని తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్,(ఆంధ్రజ్యోతి): క్షయరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీ.బి.ఆలర్ట్ ఇండియా ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. క్షయ సర్వే సిబ్బందితో మాట్లాడుతూ క్షయ నివారణకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మెడికల్ ఆఫీసర్‌లు లక్ష్మీభవాని, సల్మాబేగం ఉన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏడీఏ

మంథని, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పలు ఫెర్టిలైజర్ షాప్‌లను ఏడీఏ అంజనీ, ఏవో నవ్య, ఎస్ఐ రమేష్‌లు గురువారం తనిఖీ చేశారు. స్టాక్స్ రిజిష్టర్లను పరిశీలించారు. రైతులకు రశీదు తప్పని సరిగా ఇవ్వాలని వారు సూచించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కోల్‌సిటీ, జన్ 12 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఏసీపీ రమేష్ సూచించారు. గురువారం వన్‌టౌన్ పోలీస్, రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారంభించారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రమేష్, వైద్యులు నిదిన్, అఖిల్, ధనుంజయ్, అరుణ్, శ్రీనివాస్, ఓదెలు, మల్లయ్య, పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

(5వ పేజీ తరువాయి)

కాలువలు, వీధి లైట్లు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సుమారు 4 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేశారు.

● **ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్**

నూతనంగా ఆరంభం కానున్న పోలీస్ స్టేషన్లు, డబుల్ బెడ్ రూముల ఇళ్ల వద్ద ఏర్పాట్లను కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఆర్‌డీఓ గంగయ్య, తదితరులు పరిశీలించారు. శుక్రవారం జరగనున్న కార్యక్రమాలకు ఉదయం 10 గంటలకు ఎలిగేడు పోలీస్ స్టేషన్, 10:50 గంటలకు పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్, 11:10 గంటలకు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, 11:30 గంటలకు మహిళా పోలీస్‌స్టేషన్, 11:50 గంటలకు ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి, మధ్యాహ్నం 12:20 గంటల నుంచి చందపల్లి, రాంపెల్లి డబుల్ బెడ్ రూముల ఇళ్ల సముదాయాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరంభించనున్నారని కలెక్టర్ పేర్కొ న్నారు. మధ్యాహ్నం 12:20 గంటల నుంచి 1:40 గంటల వరకు చందపల్లి డబుల్ బెడ్ రూముల ఇళ్ల వద్ద సభ జరగనున్నదని పేర్కొన్నారు.

నూతన పోలీస్‌స్టేషన్ల అధికారులు వీరే

పెద్దపల్లిటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొత్త పోలీస్‌స్టేషన్లకు సీపీ అంబర్‌కిషోర్ ఝా అధికారులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్‌కు సీఎస్‌బీ రామగుండంలో ఉన్న సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పురుషోత్తం, ఎస్సైగా వీఆర్ రామగుండంలో ఉన్న అశోక్‌రెడ్డి, పెద్దపల్లి ఎస్సై2 గా విధులు నిర్వర్తిస్తున్న బుద్దె మల్లేష్ రూరల్ ఎస్సైగా, వీఆర్ రామగుండంలో ఉన్న ఎస్సై సత్యనారాయణ ఎలిగెడ్ ఎస్సైగా నియమించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇది వరకే కొనసాగుతుండగా ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్, ఎస్సైలు సహదేవ్‌సింగ్, రవి కాంత్‌లు విధుల్లో ఉండనున్నారు.

మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎలిగేడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడులో జరగనున్న మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఎలిగేడు పోలీస్‌స్టేషన్ భవనం



ఎలిగేడు పోలీస్‌స్టేషన్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలిగేడులో రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన పోలీస్ స్టేషన్‌ను మంత్రులు ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, తహసీల్దార్ యాకన్న, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

పాలకుర్తి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 31 ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. జడ్పీహెచ్ఎస్ ఫెర్టిలైజర్ సిటి విద్యార్థులకు మండల విద్యాధికారి తానం విమల, ఉపాధ్యాయ బృందం పూలతో స్వాగతం పలికారు. తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఏకరూప దుస్తులను అందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయలక్ష్మి, సుమిద, ఉమ, భవాని, జలీల్ పాషా, ఎంఎ ఖాద్రి, షబ్బీర్ ఆలీ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ప్రారంభ రోజు గురువారం విద్యార్థుల హాజరు అం



పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంఈవో విమల

తంత మాత్రంగానే ఉంది. వేసవి సెలవును ఎంజాయ్ చేసిన విద్యార్థులు బడులు ప్రారంభం రోజున రావడానికి ఆసక్తి చూపలేదు. పాఠశాల ప్రారంభ తొలిరోజు ఉపాధ్యాయులు వంద శాతం హాజరైనట్లు ఎంఈఓ రాజయ్య తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో అక్షరాభ్యాసం

కోల్‌సిటీటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించవద్దని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని గాంధీనగర్-2 సెంటర్‌లో గురువారం బడిబాట కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు కౌసల్య, షబానా, రజిత, రమాదేవి, మంగ, రజిత పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఎలిగేడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి అభివృద్ధి కార్యక్రమాల పేరిట ప్రజలను పక్కదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల మాటలను ఎవరూ పట్టించుకోరని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కడానికి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఎలిగేడులో జూనియర్ కళాశాల ఏర్పాటు ఏమైందని ప్రశ్నించారు. ఇందిరమ్మ గృహాలు అనర్హులకు దక్కాయన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారికి కేటాయించడంలో అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. భూభారతిలో సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని చెప్పి దరఖాస్తులు స్వీకరించి తూతూ మంత్రంగా పరిశీలన చేశారన్నారు. కప్పల ప్రవీణ్, పోచాలు, కవ్వంపల్లి బాపయ్య, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి రాజేష్, బాసంపల్లి వినోద్, పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దు

కమాన్‌పూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులపై జీపీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డివిజన్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్ అన్నారు. పెంచికల్‌పేటలో గురువారం పారిశుధ్య పనులను సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీచేశారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టకూడదని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీచేసి విద్యార్థులకు పౌష్టికాహారంపై తెలుసుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్, జూన్ 12: (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సక్రమించే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆరోగ్య కేంద్రం సమావేశ మందిరంలో గురువారం వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఇతర వైద్య ఆరోగ్య సిబ్బందితోపాటు పంచాయతీరాజ్ శాఖ సమన్వయంతో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను నివారించే చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల ఉత్పత్తి జరగకుండా వారం వారం డ్రై డే పాటించాలని, నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు, ఎంపీఓ సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో కార్యదర్శులు ఫీల్డ్ విజిట్ చేయాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులను ఫీల్డ్ అసిస్టెంట్‌లతోపాటు కార్యదర్శులు విజిట్ చేయాలని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. గురువారం బ్రాహ్మణపల్లి రైతువేదికలో ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులతో ఒరియేంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పనిసరిగా పనులను పరిశీలించి, పనులకు ముందు, తరువాత ఫొటోలు సేకరించాలని సూచించారు. పనులు చేసిన ప్రాంతాల్లో పనికి సంబంధించిన వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ ఆడిట్ జరిగిన సమయంలో పనులను సులువుగా గుర్తించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేని గ్రామాల్లో కార్యదర్శులు బాధ్యతగా భావించి పనులు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల మస్టర్లపై కార్యదర్శులు సంతకాలు చేసి, పనులను పరిశీలించిన తరువాతనే ఎంపీడీవో కార్యాలయానికి తీసుకురావాలన్నారు. ఏపీడీ సత్యనారాయణ, ఎంపీవో శరత్ బాబు, ఏపీవో రమేష్ బాబు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోల్‌సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. గురువారం 26, 28, 33 డివిజన్లతో పాటు ప్రధాన మురుగు నీటి కాలువల్లో పూడికతీత పనులను, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. ఆయన మాట్లాడుతూ కాలువల్లో చెత్తను, ప్లాస్టిక్ వస్తువులను వేయరాదని, రోజూ ఇంటింటికి వచ్చే ఆటో ట్రాలీలకు తడి, పొడి చెత్త ఇవ్వాలని సూచించారు. అశోక్‌నగర్‌లోని వాటర్ ట్యాంకు వద్ద తాగునీటి స్వచ్ఛత నిర్ధారించుకోవడానికి క్లోరిన్ పరీక్షలు నిర్వహించారు. కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

జెండా మోసిన వాళ్ళు పదవులకు అర్హులు కాదా..?

మంథని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో ఏళ్ళ తరబడి పార్టీ జెండాలు మోసిన వాళ్ళు పార్టీ పదవులకు అర్హులు కాదా.. అని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రశ్నించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం శ్రీపాదరావు నుంచి మొదలుకొని నేటి వరకు అనేక మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తోపాటు అగ్రవర్ణాల నేతలు పని చేశారన్నారు. మంథని ఎమ్మెల్యే ఒక నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో మార్కెట్ కమిటీలు, దేవస్థానాల కమిటీలు నియామకం అయ్యాయన్నారు. దుద్దిళ్ళ శ్రీనుబాబు ఏనాడైనా ప్రజల కోసం పోరాటం చేశాడా అని ప్రశ్నించారు. శ్రీనుబాబును పీసీసీ జనరల్ సెక్రటరీగా నియమించిన కాంగ్రెస్ పార్టీ ఆ పార్టీలో సీనియర్లను గుర్తించలేదన్నారు. జక్కు రాకేష్, రాజుగౌడ్, ఏగోళపు శంకర్‌గౌడ్, శంకర్‌లాల్, పుప్పాల తిరుపతి, గొబ్బూరి వంశీ, జంజర్ల శేఖర్, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోల్‌సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల కింద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జమీల్‌పాషా ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం లక్ష్మీనగర్, శివాజీనగర్, మేదరి బస్తీ, తిరుమల్‌నగర్, కళ్యాణ్‌నగర్, ఊర్వశి థియేటర్ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సర ఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పరామర్శ

సుల్తానాబాద్, జూన్ 12: (ఆంధ్రజ్యోతి): మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు, రిటైర్డు ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల వనజను గురువారం పలువురు పరామర్శించారు. ఇటీవల గుండె ఆపరేషన్ జరగగా డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చారు. నాయకులు మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, కూకట్ల నాగరాజు, కందునూరి కుమార్, రామస్వామి, సతీష్, భాగ్యలక్ష్మి, పవన్ పాల్గొన్నారు.

కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలో సింగరేణి ముందడుగు



అవగాహన ఒప్పందం చేసుకుంటున్న సింగరేణి సీఎండీ బలరాం

గోదావరిఖని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ కీలక ఖనిజాల రంగంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో భువనేశ్వర్‌లో గురువారం పరిశోధన సంస్థ సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) అనుబంధ సంస్థ అయిన ఐఎంఎంటీ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నీతి ఆయోగ్ సభ్యులు, డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ జనరల్ వీకే సారస్వత్ సమక్షంలో జరిగిన ఒప్పంద సమావేశంలో సింగరేణి సీఎండీ బలరామ్, సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ్ నారాయణ్‌తో పాటు ఇరు సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సింగరేణి గనులలో, ప్రాంతాల్లో ఉన్న వివిధ రకాల కీలక ఖనిజాల ఉనికి అన్వేషణ, ఉత్పత్తిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సహకారం కోసం ఉమ్మడి భాగస్వామ్య పద్ధతిలో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సీఎండీ తెలిపారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులలో కొన్నింటిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ జరిగిందని, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విడుదయ్యే ఫ్లై యాష్‌లో కూడా వీటిని కనుగొన్నట్లు పేర్కొన్నారు. ఆస్ట్రేలియాతో కూడా కీలక ఖనిజాల ఉత్పత్తికి సంబంధించి అవగాహనకు వచ్చామని, దీనిలో కూడా ఐఎంఎంటి సేవలు వినియోగించే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశీయంగా కీలక ఖనిజాల ఉత్పత్తి రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా తన వంతుగా కొన్ని బ్లాకులను చేపట్టడానికి సన్నద్ధమై ఉందని తెలిపారు. సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ డైరెక్టర్ రామానుజ్ నారాయణ్ మాట్లాడుతూ సింగరేణితో కుదిరిన ఈ ఒప్పందం ఒక గొప్ప లక్ష్య సాధనకు శ్రీకారం అని పేర్కొన్నారు. ఒప్పంద పత్రాలపై సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ చీఫ్ సైంటిస్ట్, హైడ్రో ఎలక్ట్రో మెటలర్జీ శాఖ హెడ్ డాక్టర్ కాశీ సంజయ్, సింగరేణి నుంచి జనరల్ మేనేజర్(ఎక్స్‌ప్లోరేషన్) బీ శ్రీనివాస్, జనరల్ మేనేజర్(బీడీ అండ్ ఎస్‌పీ) వీ రామదాసు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, నైనీ జీఎం సుజయ్ మజుందార్ పాల్గొన్నారు.

ఎల్‌ఎన్‌టి ప్రతినిధులతో జీఎంల సమీక్ష

రామగిరి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ సంబంధించిన ఎల్‌ఎన్‌టి కంపేని ప్రతినిధులతో వివిధ అంశాల పై గురువారం ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో ఓపెన్‌కాస్టుల జీఎం డి.వి సూర్యనారయణరాజు, ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావులు సమీక్ష సమావేశం నిర్వహించారు. కాస్ట్‌క్యాప్, డిపో అగ్రిమెంట్లు, భారీ యంత్రాల పనితీరు, యంత్రారల విడిభాగాలు, మరమ్మతు అంశాల పై చర్చించారు. భారీ యంత్రాలకు ఏర్పాటు సాంకేతిక పరమైన సమస్యలను కంపెనీ సర్వీస్ ఇంజనీర్లు సకాలంలో పరిష్కారించేలా చర్యలు చేపట్టాలని ప్రతినిధులకు సూచించారు. ప్రతినిధులు బాలభాస్కర్, రవిచంద్రన్, ఆర్జీ-1,2,3 ఏరియా ఇంజనీర్లు డి.వీరావు, నర్సింహరావు, విజయశేఖరబాబు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం నేతలతో సమావేశం

రామగిరి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌ల పరిధిలో గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశాన్ని జీఎం నాగేశ్వర్‌రావు గురువారం నిర్వహించారు. ఏరియాలకు సంబంధించిన పలు అంశాల పై గుర్తింపు సంఘ ప్రతినిధులతో చర్చించారు. సెక్యూరిటీ చెక్‌పోస్టుల మరమ్మతు, సివిల్, సెక్యూరిటీ విభాగాలలో ఆర్‌వో ప్లాంట్స్, ఓసిపి-1,2లలో స్క్రాప్ యార్డుల ఏర్పాటు, ఉద్యోగులకు విశ్రాంతి గది, మరుగుదొడ్ల నిర్మాణం అంశాలపై చర్చించారు. అధికారులు భాస్కర్‌రాజు, శేఖరబాబు, యాదయ్య, రామ్మోహన్, సత్యనారాయణ, రాజశేఖర్, చంద్రశేఖర్, కాశీ విశేశ్వర్‌రావు, సుదర్శనం, రాజేంద్రకుమార్, ఉదయభాస్కర్, చంద్రశేఖర్, రఘురామ్, పాల్గొన్నారు.

మహారాష్ట్ర నేచురల్ గ్యాస్ లిమిటెడ్ ప్రతినిధుల పర్యటన

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో గురువారం మహారాష్ట్ర నేచురల్ గ్యాస్ లిమిటెడ్(ఎంఎన్‌జీఎల్) ప్రతినిధుల బృందం పర్యటించింది. సింగరేణిలో డీజిల్, పెట్రోల్ వంటి ఇంధనాల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత నేచురల్ గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా (ఎంఎన్‌జీఎల్) బృందం సభ్యులు పర్యటించారు. జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్జీ-2 అధికారులతో బృంద సభ్యులు సమావేశమయ్యారు. ఇంధన వినియోగ పద్ధతులు, వాహనాల ప్రాసెస్, పర్యావరణ హిత చర్యలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సింగరేణి అధికారులు బృందం సభ్యులకు వివరించారు. అనంతరం ఓసీపీ-3 వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలించి, క్వారీలో పని స్థలాలను పరిశీలించారు. నేచురల్ గ్యాస్ వాడకం సాధాసాధ్యాలపై బృందం సమగ్రంగా అధ్యయనం చేయనున్నది. ఈ విధానం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, ఆర్థికంగా మెరుగైన ఫలితాలు సాధించగలమని సింగరేణి అధికారులు, (ఎంఎన్‌జీఎల్) బృంద సభ్యులు అభిప్రాయపడ్డారు. ఎంఎన్‌జీఎల్ డైరెక్టర్ మేజర్ శంకర్ కరాజాగీ, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్కే సింగ్, సింగరేణి జీఎం ఓసీపీలు, ఈఅండ్ఎం డీపీ ఎస్ఎస్ఎన్ రాజు, పీఓ ఉదయ్‌హరిజన్, పీఈ రాజాజీ, పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ప్రవేశాలపై స్పష్టత ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో జరుగుతున్న సీబీఎస్ఈ ప్రవేశాలపై యాజమాన్యం కార్మికులకు స్పష్టత ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్యం సీబీఎస్ఈలో 480 ఖాళీలు ఉన్నాయని, 80 శాతం(326) కార్మికుల పిల్లలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించిందని, ప్రస్తుతం సింగ రేణి పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే చాలా మందికి సీట్లు దొరకవని తెలిపారు. అర్హత పరీక్ష పేపర్‌లు పాఠశాలలోదిద్ది, ఫలితాలు కార్పొరేట్ ఆఫీస్‌లో ప్రకటిస్తామని చెప్పడం కార్మికుల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

గోదావరిఖని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియాలోని జీవీటీసీ ట్రైనింగ్ సెంటర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో కిమ్స్ ఫౌండేషన్, టెక్ మహీంద్రా సంయుక్త భాగస్వామ్యంతో ఉచిత శిక్షణ కార్యక్రమానికి సంబంధించి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 118మంది దరఖాస్తు చేసుకోగా 85మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కిమ్స్ ఫౌండేషన్ హెచ్‌ఆర్ మేనేజర్ ఇంటర్వ్యూలను జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించారు. ఎంపికైన వారికి ఈ నెల16 నుంచి హైదరాబాద్‌లోని కిమ్స్ ఫౌండేషన్‌లో 3నెలల పాటు ఉచిత శిక్షణ, భోజనం, వసతి కల్పించనున్నారు. శిక్షణలో ఎంపికైన వారికి నెలకు రూ.15వేల నుంచి రూ.25వేతనాలతో ఉద్యోగాలు ఇవ్వనున్నారు. ఏరియా ట్రైనింగ్ మేనేజర్ యన్ దేనిల్ కుమార్, డీజీఎం కృష్ణ మురళి, వేణుగోపాల్, మాధవ్ రెడ్డి, జీవీటీ సిబ్బంది పాల్గొన్నారు.



సింగరేణి డైరెక్టర్(పా)గా గౌతమ్



గోదావరిఖని, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్(పా)గా గౌతమ్ పోత్రు నియమితులయ్యారు. గతంలో డైరెక్టర్(పా)గా ఉన్న బలరాం నాయక్ సీఎండీగా పదోన్నతి పొందడంతో డైరె క్టర్(పా) పోస్టు ఇతర డైరెక్టర్ల అదనపు బాధ్యతగా మారింది. గురువారం రాష్ట్రంలో జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్‌గా పనిచేస్తున్న గౌతమ్ పోత్రును సింగరేణి డైరె క్టర్(పా)గా బదిలీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తాం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కృషి చేస్తున్నట్లు ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి తెలిపారు. గురువారం ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్‌మెంట్, సొంత ఇంటి పథకం అమలు, మారు పేర్ల కార్మికుల సమస్యను ఒకే దఫా పరిష్కరించేలా యూనియన్ పక్షాన కృషి చేస్తున్నట్టు తెలిపారు. గేట్‌మీటింగ్‌లో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీంద ర్‌రెడ్డి, గడ్డం తిరుపతి, జక్కుల దామోదర్‌రావు, వెంకటస్వామి, సదానందం పాల్గొన్నారు.

డిస్పెన్సరీలో మందుల కొరత లేకుండా చూడాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 డిస్పెన్సరీలో మందుల కొరత లేకుండా చూడాలని గురువారం ఏఐటీయూసీ నాయకులు డీవై సీఎంఓకు వినతిపత్రాన్ని అందజేశారు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, రాత్రి షిఫ్టులో వైద్యుడిని అందుబాటులో ఉంచాలని నాయకులు వినతిపత్రంలో కోరారు.

ఆర్‌జీ-1 ఏరియా అధికార ప్రతినిధిగా రవీందర్‌రెడ్డి

గోదావరిఖని, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా అధికార ప్రతినిధిగా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. రవీందర్‌రెడ్డిని పర్సనల్ విభాగం అధికారులు, స్టాఫ్ సన్మానించారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, పర్సనల్ విభాగం సంబంధించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తామన్నారు. అలాగే బదిలీపై వచ్చిన నాగుల వేణు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్, ఎండీ ఫిరోజ్ ఖాన్ సీనియర్ పీఓ కుడా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో పదవి బాధ్యతలు చేపట్టారు.

వన్ ఇంక్లైన్ ఉద్యోగులతో సమావేశం

గోదావరిఖని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీడీకే 1ఇంక్లైన్ ఉద్యోగులతో ఆర్‌జీ-1 జీఎం జీఎం డీ లలిత్ కుమార్ ఏరియా ఇంజనీర్, గని మేనేజర్, సేఫ్టీ ఆఫీసర్, పిట్ సెక్రెటరీలతో కలిసి గురువారం సమా వేశమయ్యారు. ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యత, రక్షణ గురించి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఉద్యోగి పని స్థలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

11ఇంక్లైన్‌ను సందర్శించిన రీజియన్ సేఫ్టీ జీఎం

గోదావరిఖని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 11ఇంక్లైన్‌ను రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్, ఆర్‌జీ-1 ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్ గురువారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను సందర్శించి ఉదయం 9గంటల షిఫ్టు ప్రారంభంలో తీసుకోవల్సిన భద్రత చర్యల గురించి ప్రసంగించారు. ఏజెంట్ ఆఫీసు వద్ద గనికి సంబంధించిన వ్యాపులను పరిశీలించారు. ఏజెంట్ సీ శ్రీనివాస్, మేనేజర్ బీ మల్లేశం పాల్గొన్నారు.